క్లుప్తంగా

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలో కంచి కరుణాసాగర్ నిల్వ చేసిన రూ.72,100 విలువైన గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ వివరాలు వెల్లడించారు. కరుణాసాగర్ అమ్మకానికి ప్రయత్నిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఉద్యమకారిణి మృతి



అమీనా బీ (ఫైల్)

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారిణి అమీనా బీ (67) ఆదివారం మృతి చెందింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆమె క్రియాశీల పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అమీనా బీ మృతదేహానికి నాటి ఉద్యమకారులు కొణిజేటి భిక్షపతి, శాడ అనిత, శాడ సరిత, తదితరులు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

బియ్యం, సరుకుల అందజేత



దుగ్గొండి : మండలంలోని పీజీ తండాకు చెందిన యువకులు నూనావత్ మాన్‌సింగ్, తదితరులు స్థానిక నిరుపేద కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఐ అజ్మీర రాజేందర్, ప్రముఖ వైద్యుడు నూనావత్ రవి సహకారంతో స్థానిక ఆదివారం బియ్యం సాయం చేశారు. ఈ సందర్భంగా మాన్‌సింగ్ మాట్లాడారు. పండుగ నాడు పేదలు పస్తులుండకూడదనే ఉద్దేశ్యంతో ఎన్‌ఆర్‌ఐ రాజేందర్, వైద్యుడు రవి సహకారం కోరగా రెండు క్వింటాళ్ల బియ్యం, సరుకులు సమకూర్చినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే అత్యంత పేదరికం అనుభవిస్తున్న నూనావత్ సుజాత, లావుడ్య జబ్రదలకు క్వింటా బియ్యం, సరుకులు చొప్పున అందజేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు అజ్మీర వీరన్న, పవన్, రవి, నవీన్, లావుడ్య రమేశ్, రాజశేఖర్, రాజు, నాగ జైపాల్, చింటు, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

ఆత్మకూరు : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు అధ్వర్యంలో ఏప్రిల్ 4న పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఐ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జాబ్‌మేళాలో పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిరుద్యోగులు తమ పేర్లను పోలీస్‌స్టేషన్ వాట్సాప్ నంబర్ 87126 85019 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి జాబ్‌మేళాలో త్వరగా టోకెన్ ఇచ్చే విధంగా ఆత్మకూరు పోలీసులు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

పరామర్శ

ఖిలా వరంగల్ : వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ సమీపంలోని స్వగృహంలో పెద్దోజు నాగభూషణం (70) అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందారు. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో ఏపీటీఎఫ్‌ను బలోపేతం చేయడమే కాకుండా ఉపాధ్యాయ సమస్యలపై అనేక ఉద్యమాలు చేసిన మహోనీయుడని పలువురు కొనియాడారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కడారి భోగేశ్వర్, బెల్లంకొండ రమేష్, పూర్ణచందర్, వెంకటేశ్వర్లు, బండి కోటి తదితరులు ఉన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏరుకొండ రజనీ–రవీందర్ గౌడ్ దంపతులు ఆదివారం మూడు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. వీరిని ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి అభినందించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, దుగ్గొండి, గీసుకొండ, సంగెం, రాయపర్తి, తదితర మండలాల్లో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేపట్టారు. అర్చకులు ఆయా రాశుల ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు చదివి వినిపించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఉగాది పచ్చడి అందజేశారు. చిన్నారులు, పెద్దలు, వృద్ధులు, మహిళలు, యువకులు సంప్రదాయ దుస్తులతో ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నర్సంపేట : వాసవి కల్యాణ మండపంలో పంచాంగం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అర్చకులు, ప్రతినిధులు



నల్లబెల్లి : రాజరాజేశ్వరస్వామి ఆలయంలో..



వర్ధన్నపేటలో..



దుగ్గొండి : నాచినపల్లి రామాలయంలో..



గీసుకొండ: సుమన్‌ను సన్మానిస్తున్న నాయకులు



సంగెం : రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



రాయపర్తి : వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

అన్ని మతాల సారమొక్కటే

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : అన్ని మతాల సారమొక్కటేనని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. హిందువులు, ముస్లిములు సోదర భావంతో మెలగాలని, ఉత్తమ జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరుల రంజాన్ ఉపవాస దీక్షలు కఠోరంగా ఉంటాయని చెప్పారు. క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని ముస్లిం సోదరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తొలుత ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిములు

పెద్దమ్మతల్లికి 'ముదిరాజ్'ల బోనాలు



పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాలు సమర్పిస్తున్న ముదిరాజ్ కులస్తులు

గీసుకొండ : ధర్మారంలో ముదిరాజ్ కులస్తులు ఆదివారం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ముదిరాజ్ కులస్తులు ఉదయం నుంచే ఆలయం వద్ద కుటుంబ సమేతంగా తరలివచ్చి పూజలు చేశారు. పలు కులాల ప్రజలు సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు.

పూజారి రాములుకు ఉగాది పురస్కారం



రాములును సన్మానిస్తున్న శైలజ రామయ్యర్, తదితరులు

దుగ్గొండి : మండలంలోని ముద్దునూరు గ్రామంలోని శివరామాంజనేయస్వామి ఆలయ పూజారి గాదెపాక రాములు ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాములును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, సాంస్కృతిక శాఖ అధికారులు ఆదివారం పురస్కారం అందజేసి సన్మానించారు. దళిత సామాజికవర్గానికి చెందిన రాములు సుమారు 30 ఏళ్లుగా ముద్దునూరు ఆలయంలో పూజారిగా సేవలు అందిస్తున్నాడు. హనుమాన్ ప్రచారకుడిగా కొనసాగుతున్నాడు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం మౌనదీక్షలు, ప్రత్యేక యాగాలు, రాష్ట్రవ్యాప్తంగా 1108 హనుమాన్ విగ్రహాలకు చందనం వేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాడు. ఈ సందర్భంగా రాములు మీడియాతో మాట్లాడారు. తనకు పురస్కారం రావడానికి సహకరించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. రాములుకు పురస్కారం అందడంతో ముద్దునూరు శివరామాంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామస్తులు, భక్తులు, దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

'ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలివ్వాలి'

గీసుకొండ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని తమ ఆట, పాటల ద్వారా ముందుకు తీసుకుని వెళ్ళిన కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకురాలు ఎర్రాల స్వప్న కోరారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ సర్కారు 550 మంది కళాకారులకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందని, టీపీసీసీ ఎన్నికల మానఫెస్టోలో పేర్కొన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలివ్వాలని ఆమె విన్నవించారు.

గోర్‌బోలి భాషపై తీర్మానం.. హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న ఆదివాసీ కాంగ్రెస్, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

హన్మకొండ: లంబాడీల మాతృభాష గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లు చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్, లంబాడ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు తేజావత్ బెల్లయ్య నాయక్ చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోతు రవీందర్ నాయక్ మాట్లాడుతూ గోర్‌బోలి భాషకు గుర్తింపు, గౌరవం తీసుకువచ్చేలా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మకమన్నారు. ఇది భాషా పరిరక్షణలో మరో కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 40 లక్షలు, దేశంలోని 15 కోట్ల మంది బంజారాలకు సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు వినోద్ లోక్‌నాయక్, తిరుపతి నాయక్, సునీల్‌నాయక్, రాథోడ్‌పందు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో సప్తవర్ణాభిషేకం



కాజీపేటలో ప్రత్యేక అలంకరణలో శ్వేతార్కుడు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను అర్చకులు ఆదివారం నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛరణలతో సప్తవర్ణాభిషేకాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడికి నిత్య కల్యాణ వేడుకలు జరిపించారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ సమావేశ మందిరంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఎస్సై లవన్‌కుమార్, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

కాజీపేట: కాజీపేట పట్టణంలోని 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో ఆదివారం సాయంత్రం పేద కుటుంబాలకు రంజాన్ కానుకలను కార్పొరేటర్ విజయశ్రీ పంపిణీ చేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ.నేహాల్ ఆధ్వర్యంలో పేదలకు చేయూతనందించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, బైరబోయిన కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో ఏర్పాట్ల పరిశీలన

హసన్‌పర్తి: హసనపర్తి మండల కేంద్రంలోని ఈద్గాలో సోమవారం జరగనున్న రంజాన్ పండుగ ఏర్పాట్లను స్థానిక ఎస్సై దేవేందర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఖలీల్, కోశాధికారి నయీమొద్దీన్, ఉపాధ్యక్షుడు ముజీబ్, సభ్యులు మసూద్, ముస్తాక్, అన్వర్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పట్టణంలో పచ్చదనం కరువు

● అధికారుల నిర్లక్ష్యంతో ఎండిపోతున్న మొక్కలు
● పల్లె ప్రకృతి వనానికి నిత్యం తాళం

నర్సంపేట : పట్టణంలో పచ్చదనం కరువైంది. పట్టణ రహదారిలోని డివైడర్లపై నాటిన మొక్కలు ఎండిపోతూ వెక్కిరిస్తున్న దుస్థితి నెలకొంది. గ్రీన్ ల్యాండ్ స్థలాల్లోని చెట్లను పట్టించుకోని దుస్థితి నెలకొంది. ప్రస్తుత వేసవి సెలవుల్లో ఆహ్లాదం పంచాల్సిన పార్కులు లేక, ప్రకృతి వనాలు మూసి ఉండడంతో చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నర్సంపేటలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

24 వార్డులు.. 40 వేల జనాభా

పట్టణంలోని 24 వార్డుల పరిధిలో 40 వేల జనాభా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కుమ్మరికుంట పార్కు అభివృద్ధికి నోచుకోవడం లేదు. నెక్కొండ రోడ్డులోని పట్టణ ప్రకృతి వనం గేటుకు నిత్యం తాళం వేసి ఉంటుంది. బస్ డిపో సమీపంలోని వరంగల్ రోడ్డు ప్రధాన రహదారిలో పచ్చని చెట్లను నరికివేశారు. పలు కాలనీల్లో గతంలో నాటిన పూల, ఇతర మొక్కల సంరక్షణను పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో అవి బోసిపోతున్నాయి.

15 ఏళ్లు పెంచిన చెట్ల తొలగింపు

పట్టణంలోని గ్రీన్ ల్యాండ్ స్థలంలో 15 ఏళ్లుగా వందలాది టేకు, ఇతర చెట్లను పెంచారు. గతంలో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదం పంచి పచ్చదనం పరిరక్షణకు కొంత మేరకు పాటు పడ్డారు. ఇటీవల సదరు స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడానికి నిర్ణయించడంతో రెండ్రోజుల వ్యవధిలో 15 ఏళ్ల పెంచిన 123 టేకు, ఇతర చెట్లను నరికివేయడం విమర్శలకు దారితీసింది. మున్సిపల్ అధికారుల అవగాహనా రాహిత్యంతోనే స్థానిక ప్రకృతి వనం కనుమరుగు అయ్యిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వనం తాళాలు తీయాలి

పట్టణ ప్రజలు పచ్చటి ప్రకృతి మధ్య సేద తీరేలా పార్కుల అభివృద్ధికి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రకృతి వనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పూలమొక్కలు, వాకింగ్ ట్రాక్‌లు ఆహ్లాదంగా తీర్చిదిద్ది వేసవిలో చిన్న పిల్లలు ఆడుకునేలా చూడాలి. ప్రధానంగా నెక్కొండ రోడ్డులోని ప్రధాన రహదారిపై రెండేళ్ల క్రితం రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం గేట్లకు తాళం తీసి చిన్నారులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.



చెట్లను నరుకుతున్న సిబ్బంది (ఫైల్)



తాళం వేసి ఉన్న నెక్కొండ రోడ్డు ప్రకృతి వనం

పచ్చని చెట్లను తొలగించారు



ఏడో వార్డులోని పట్టణ ప్రకృతి వనం ఎదుట 11 ఏళ్లుగా ఉంటున్నాం. టేకు, ఇతర చెట్లతో పచ్చని వాతావరణం ఉండేది. పలువురు ప్రకృతి వనంలో సేదతీరే పరిస్థితి ఉండేది. 15 ఏళ్లపాటు పెంచిన చెట్లను సబ్‌స్టేషన్ నిర్మాణం పేరుతో రెండ్రోజుల్లో నరికివేయడంతో బోసిపోయింది. అభివృద్ధి పేరుతో ఆహ్లాదం పెంచే భారీ చెట్లను నరికి వేయడం సమంజసం కాదు.

– బొడిగె శ్రీదేవి, ఉపాధ్యాయురాలు

పార్కులను అభివృద్ధి చేయాలి



చిన్నారుల ఆట పాటలకు ఉపయోగపడేలా, పట్టణ ప్రజలు పార్కుల్లో సేదతీరేలా మున్సిపాలిటీ పరిధిలో పార్కులను అభివృద్ధి చేయాలి. వేసవి పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లలు ఆడుకోవడానికి పార్కులు అందుబాటులో లేక బయటకు వెళ్లలేకపోతున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం పట్టణం మధ్యలో ఉన్న చెట్లను తొలగించడంతో కాలనీ బోసిపోతుంది.

– ఎండి.పాషా, స్థానికుడు

గ్రూప్ -1 ర్యాంకర్ తేజస్విని రెడ్డికి సన్మానం

హన్మకొండ: గ్రూప్ -1 ర్యాంకర్ జిన్న తేజస్విని రెడ్డిని హనుమకొండ గాంధీనగర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సన్మానించారు. హనుమకొండ విద్యానగర్‌కు చెందిన తేజస్విని రెడ్డిని, ఆమె తల్లిదండ్రులు హేమలత, విజయ్‌పాల్ రెడ్డికి కాలనీ కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, కమిటీ బాధ్యులు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అభినందనలు తెలిపారు.

కాజీపేట రైల్వే జంక్షన్‌కు అన్యాయం చేస్తే పోరాటమే

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌ను నిర్వీర్యం చేయడానికి కొంతమంది అధికారులు చేస్తున్న కుట్రపూరిత వ్యవహారాలను తిప్పి కొట్టడానికి, ప్రజా ఉద్యమాలు నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు సీపీఎం నేత ఎం.చుక్కయ్య హెచ్చరించారు. కాజీపేట మండల పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ కేంద్రం ఏర్పాటును అడ్డుకోవడం కోసమే క్రూలింకులను విజయవాడకు తరలిస్తున్న విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులు గుర్తించాలన్నారు. పోరాటాలకు పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. సమావేశంలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్స్‌తో యువతకు ఉపాధి

● నెక్ ప్రతినిధి వినీత్‌రావు

రాయపర్తి : ఎగ్ కార్ట్స్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నట్టు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) ప్రతినిధి ఎర్రబెల్లి వినీత్‌రావు తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లిలో వేముల రమేశ్‌కు మంజూరైన రూ.70 వేల విలువైన ఎగ్ కార్ట్స్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్ట్ ఎగ్ కార్ట్స్ పథకం ద్వారా రమేశ్‌కు ఎగ్ కార్ట్స్ అందించినట్టు తెలిపారు. కోడిగుడ్డు బలవర్థక ఆహారమన్నారు. ప్రతిఒక్కరూ కోడిగుడ్డు తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎగ్ కార్ట్స్ నిర్వాహకులను ప్రజలు ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువత ఎగ్ కార్ట్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, పుడమి రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ కోశాధికారి వళపాక సుధాకర్, నాయకులు దేవేందర్, అనంతప్రసాద్, పారుపల్లి యాదవరెడ్డి, వళపాక సునీల్, సాయిబాబా, సోమేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎగ్ కార్ట్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వినీత్‌రావు

మద్యం సీసాలు ధ్వంసం

కొత్తగూడ : మద్యం విక్రయాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు మద్యం సీసాలు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక మహిళలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో బెల్ట్ షాపులను నిర్వహిస్తూ విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. పలువురు యువకులు సాయంత్రం అయిందంటే కూలి డబ్బులు తీసుకుని బెల్టుషాపుకే వెళ్తున్నారు. దీంతో పలు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్నాయి. ఈ క్రమంలో మహిళలు ఆవేదనకు గురై దీంతో పలుమార్లు బెల్టు షాపుల నిర్వాహకులకు, గ్రామపెద్దలకు సమస్యను వివరించారు. అయినా గ్రామంలోని బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు ఆపకపోవడంతో స్థానిక మహిళా సంఘాల సభ్యులంతా ఏకమై తమ భర్తలకు మద్యం అమ్ముతున్న బెల్టుషాపుల్లో సోదాలు చేసి దొరికిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు.

శ్రీరామనవమి వేడుకలను జయప్రదం చేయాలి

దామెర : శ్రీరామ నవమి వేడుకలను జయప్రదం చేయాలని మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గంగిడి శ్రీధర్‌రెడ్డి ప్రజలను, ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఏప్రిల్ 6న ఉదయం శ్రీరామచంద్రుడి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణ ఉంటుందని చెప్పారు. తదనంతరం మహాన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు వివరించారు. వేడుకలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు గుమ్మడవెల్లి సుబ్బయ్య శర్మ, శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, సత్యవర్ధన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, కృష్ణమూర్తి, భిక్షపతి, పోశాలు, సమ్మిరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.